క్లుప్తంగా

26న నరసింహునికి చందనోత్సవం



కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో ఈనెల 26వ తేదీ లక్ష్మీనరసింహ స్వామికి చందనోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు గుడిపూడి శేషాచార్యులు పేర్కొన్నారు. ఉపాలయంలో వేంచేసిఉన్న స్వామివారికి ఉదయం ఆరు గంటల నుంచి చందనోత్సవం (గంధము)తో అభిషేకం నిర్వహిస్తామని భక్తులు రెండు రోజులు ముందుగానే స్వామివారికి చందనాన్ని సమర్పించవచ్చు అన్నారు.

రేపు వాహనాల వేలం

పోలవరంరూరల్ : ఈనెల 25వ తేదీన పోలవరం ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాలను వేలం వేస్తున్నట్లు ఎస్ఈబీ ఇన్స్పెక్టర్ జె.శ్రీనివాస బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలను ఎస్ఈబీ ఏలూరు సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలని, వివరాలకు పోలవరం ఎస్ఈబీ స్టేషన్‌లోగాని, 94409 02432, 94411 44332 నంబర్లలో గాని సంప్రదించాలన్నారు.

రోటరీ క్లబ్ సర్వసభ్య సమావేశం

జంగారెడ్డిగూడెం : రోటరీ క్లబ్ సర్వసభ్య సమావేశం ఆదివారం రోటరీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. అధ్యక్షుడు రొంగల దేవీప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ రోటరీ నిర్దేశిత లక్ష్య సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి బవిరిశెట్టి హనుమాన్ తిలక్, రోటరీ చార్టర్ సభ్యులు చామర్తి శ్రీరాములు, ఉపాధ్యక్షులు ఉడా రాంగోపాల్ (గోపీ), సహాయ కార్యదర్శి కొమ్ముకూరి నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

500 మందికి నియామక పత్రాల అందజేత

దెందులూరు: వేగవరంలోని హేలాపురి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ కళాశాలలో వైస్ ప్రెసిడెంట్, డాక్టర్ అరసవల్లి అరవింద్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 500 మందికి నియామక పత్రాలను సీఈఓ ఆర్. సౌజన్య, ప్రిన్సిపల్ డాక్టర్ డీ. మోహన్‌రెడ్డి అందజేశారు. ఆదివారం కళాశాలలో అరసవల్లి అరవింద్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 60 మల్టీ నేషనల్ దిగ్గజ కంపెనీలు 3వేలకు పైగా ఉద్యోగాలకు మెగా జాబ్‌మేళా నిర్వహించారు. అర్హులైన వారిని 500 మందిని ఎంపిక చేసి వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఈఓ ఆర్.సౌజన్య మాట్లాడుతూ భవిష్యత్తులో నిరుద్యోగ యువతకు ఉపాధి, భద్రత, మహిళాభివృద్ధి లక్ష్యంగా మరిన్ని మెగా జాబ్‌మేళాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం కళాశాల ఏఓ కరుణానిధి మెగా జాబ్‌మేళా నిర్వహించి వందలాది మందికి బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించిన కళాశాల వైస్ ప్రెసిడెంట్ అరవింద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వే బోర్డు మెంబర్ తనిఖీతో స్పందించిన రైల్వే కాంట్రాక్టర్

దెందులూరు: దెందులూరు– అలుగులగూడెం వద్ద నిర్మిస్తున్న అండర్ పాస్ పక్కన అత్యవసర ప్రయాణ మార్గాన్ని తనిఖీ చేయడంతో ఆరు గ్రామాల ప్రజలకు తాత్కాలికంగా సమస్య తొలగింది. ఇటీవల కేంద్ర రైల్వేబోర్డు రైల్వే జోనల్ యూజర్ కన్సల్టెన్సీ కౌన్సిల్ బోర్డు మెంబర్ గుమ్మడి వెంకట చైతన్య కృష్ణ అండర్‌పాస్ నిర్మాణ వద్ద మార్గాన్ని తనిఖీ చేశారు. దెందులూరు– అలుగులగూడెం వెళ్లే మార్గం కాలినడకకు కూడా వీలు లేని విధంగా నీరు నిలిచిపోవడం, నడిస్తే బురదతో జారిపడిపోవడం, అసలు వెళ్లలేని విధంగా తయారైంది. ఈ నేపథ్యంలో స్పందించిన రైల్వే కాంట్రాక్టర్ ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా మోటారు పెట్టి బురద నీటిని బయటకు తోడుతున్నారు. ట్రాక్‌కు రెండు వైపులా నడవడానికి అసౌకర్యం లేకుండా నడిచివెళ్లేందుకు చర్యలు చేపట్టారు. రైల్వే ఉన్నతాధికారుల సైతం తరుచూ అండర్ పాస్ నిర్మాణం, ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన మార్గానికి అసౌకర్యం లేకుండా తరుచూ తనిఖీలు చేయాలని ఆరు గ్రామాల ప్రజలు రైల్వే ఉన్నతాధికారులను కోరుతున్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్) : వీవోఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ కోరారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయం వద్ద వెలుగు వీవోఏల జిల్లా సమావేశం లక్ష్మీ రాధా అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ వీవోఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. వీవోఏల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఏ నిర్మలాదేవి, జిల్లా కార్యదర్శి ఎస్‌కే సుభాషిణి మాట్లాడుతూ వీవోఏలకు మహిళా మార్టులు పెనుభారంగా మారాయన్నారు. కోళ్లు, గొర్రెలు, మేకలు, గేదెలు ఇచ్చి అభివృద్ధి చేయాలని చిన్న సంఘాలపై ఒత్తిడి తెచ్చే విధంగా పనిచేయిస్తున్నారన్నారు. తాము ఆన్‌లైన్లో పనులను సొంత ఫోన్లలో చేస్తున్నామని అవి కూడా ఇప్పుడు హ్యాంగ్ అయిపోతున్నాయని కాబట్టి వీవోఏలకు ఫోన్లు ఇప్పించాలని కోరారు. పనిభారం తగ్గించాలని, తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

వలంటీర్లకు వందనం

కన్నబిడ్డలా ఆదుకున్నాడు

నా పేరు మహమ్మద్ సాదిఖ్. మాది చింతలపూడి. కరోనాతో బయటికి రావడానికే భయపడుతున్న తరుణంలో మా గ్రామ వలంటీర్ ఎండీ సూరజ్ దొలా కన్నబిడ్డలా ఆదుకున్నాడు. లాక్‌డౌన్ వల్ల రెడ్ జోన్ ప్రకటించి పోలీసులు ఇంటి నుంచి బయటకు వెళ్లనిచ్చేవారు కాదు. వలంటీర్ ప్రతి రోజు ఇంటికి వచ్చి మా అవసరాలు తెలుసుకుని బయటి నుంచి నిత్యవసర సరుకులు, కూరగాయలు తీసుకువచ్చి ఇచ్చాడు. అదేవిధంగా ప్రతినెలా ఒకటో తేదీన ఇంటికి వచ్చి పింఛన్ అందజేస్తున్నాడు. ప్రజలకు ఎన్నో సేవలు అందిస్తున్న వలంటీర్లపై పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తప్పు. వలంటీర్ వ్యవస్థ లేకపోతే నిత్యం బాధలు పడేవాళ్లం. ఈ విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.



కరోనా సమయంలో పింఛన్ అందచేస్తున్న వలంటీర్ సూరజ్

వలంటీర్ వ్యవస్థ చాలా బాగుంది



మా వలంటీర్ ముప్పిడి మల్లేశ్వరి మా ఇంటికి వచ్చి ఇంటి స్థలానికి అప్లికేషన్ పూర్తి చేసి 90 రోజుల్లో మా కోడలు పేరు మీద ఇంటి పట్టా ఇప్పించింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించడంలో, అర్హులైన వారికి వాటిని అందజేయడంలో వలంటర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. గత ప్రభుత్వాల్లో ఏ పథకాలు ఇస్తున్నారో టీవీల్లోనూ పేపర్లో చూడడం తప్ప తెలిసేది కాదు. ఇప్పుడు మారుమూల గ్రామాల్లో కూడా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పథకాలు నేరుగా ఇంటికి అందజేయడం వలంటరీ వ్యవస్థ వల్లే సాధ్యమైంది. వలంటరీ వ్యవస్థ చాలా బాగుంది.

– చిప్పాడ నాగకుమారి, జంగారెడ్డిగూడెం

వలంటీర్లను కొనసాగించాలి



జగనన్న చేయూత పథకానికి నాకు అర్హత ఉందని మా వలంటీర్ కాంటరెడ్డి భవానీ గుర్తించి ఆ పథకానికి సంబంధించిన పత్రాలను సచివాలయంలో అందజేసింది. అందుకే నాకు జగనన్న చేయూత పథకం సొమ్ము అందింది. వలంటరీ వ్యవస్థ చాలా బాగుంది. గతంలో పథకాలు పేపర్లో చూడడమే తప్ప నేరుగా ఇంటికి వచ్చి మీకు ఈ పథకం వస్తుందని అని చెప్పే వాళ్లు ఉండేవారు కాదు. పూర్తిస్థాయిలో పథకాలు పేదవారికి అందేవి కావు. వలంటరీ వ్యవస్థను కొనసాగించాలి.

– ఉండ్రాజవరపు శ్యామల, జంగారెడ్డిగూడెం

జగన్ పాలనలో అందుబాటులోకి ప్రభుత్వ సేవలు

- చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- గురవాయిగూడెంలో సచివాలయం ప్రారంభం



గురవాయిగూడెంలో సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ జిల్లా, మండల స్థాయిలో ప్రజలకు అందాల్సిన సేవలను ఒక సచివాలయ ద్వారా ప్రజల ముంగిటకు తీసుకువచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయం, వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలన్ని ప్రజలకు నేరుగా అందుతున్నాయన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే స్థానిక ప్రజా ప్రతినిధులకుగాని, తన దృష్టికి గాని, జగనన్న చెబుదాం కార్యక్రమాల దృష్టికిగాని తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుబ్బల సత్యవేణి, ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ రీజనల్ చైర్మన్ వందనపు సాయిబాల పద్మ, ఎంపీటీసీ కొయ్య రమారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, కోఆప్షన్ సభ్యులు లాల్ అహ్మద్, వైఎస్సార్ సీపీ నాయకులు దల్లి రామాంజనేయరెడ్డి, వేముల బాల గురవయ్య, బత్తిన చిన్న, తదితరులు పాల్గొన్నారు.

డేటా చౌర్యం అంటే ఏమిటో పవన్ తెలుసుకోవాలి

డేటా చౌర్యం అంటే ఏమిటో ముందు పవన్ కల్యాణ్ తెలుకోవాలని, తెలియకుండా నోటికొచ్చినట్లు విమర్శలు చేయడం తగదని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. గురవాయిగూడెంలో సచివాలయం భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎదుటి వారికి తెలియకుండా సమాచారాన్ని దొంగతనం చేయడం డేటా చౌర్యం అంటారన్నారు. మన ప్రమేయం లేకుండా మొబైల్ ఇతర విధానాల ద్వారా వ్యక్తిగత సమాచారాన్ని తీసుకోవడాన్ని డేటా చౌర్యం అంటారని, పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలు డేటా చౌర్యం చేస్తుంటాయన్నారు. గతంలో చంద్రబాబు, ఆయన కుమారుడు పెట్టిన సంస్థలు డేటా చౌర్యం చేసిందన్నారు. వలంటీర్లు ఇంటికి వెళ్లి ఎవరికైతే పథకాలు అవసరమో వారి వద్ద నుంచి పేరు. వయస్సు, సామాజిక వర్గం వంటివి సేకరించి కావాల్సిన సేవలందిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అందుకునేందుకు స్వచ్ఛందంగా ప్రజలు ఇస్తున్న సమాచారాన్ని డేటా చౌర్యం అని పవన్ కల్యాణ్ మాట్లాడటం సరికాదన్నారు. డేటా చౌర్యం పదాన్ని పవన్ కల్యాణ్ వెనక్కి తీసుకోవాలని ఎమ్మెల్యే ఎలీజా అన్నారు. వలంటీర్లపై విమర్శలు చేయడం తగదని, ముఖ్యమంత్రిపై బురదజల్లే ప్రయత్నంలో లేనిపోని మాటలు, అర్థం తెలియని మాటలు మాట్లాడటం తగదని పవన్‌కు హితవు పలికారు.

వృద్ధాశ్రమంలో తల్లిదండ్రుల దినోత్సవం



వృద్ధాశ్రమంలో నిర్వహిస్తున్న అన్నసమారాధన

కొయ్యలగూడెం : నిరాదరణకు గురైన వృద్ధులను సేవించడం స్ఫూర్తిదాయకం అని రోటరీ క్లబ్ అధ్యక్షులు ఎ.విశ్వనాథ శర్మ పేర్కొన్నారు. తల్లిదండ్రుల జాతీయ దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో వృద్ధుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. సచివాలయాల మండల కోఆర్డినేటర్ నూకల రాము వృద్ధులకు అన్నసమారాధన చేశారు. క్లబ్ సభ్యులు, వైఎస్సార్ సీపీ సచివాలయాల కన్వీనర్లు పాల్గొన్నారు.

బెదిరింపులపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : తన కారును ఇవ్వకుండా, బెదిరిస్తున్నట్లు బాధితుడు మత్రి కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెంకు చెందిన మత్రి కిరణ్‌కు స్విఫ్ట్ డిజైర్ కారు ఉంది. ఈ నెల 17న గోరంట్ల ప్రతాప్ రెడ్డి అనే వ్యక్తి అవసరం నిమిత్తం కిరణ్ నుంచి కారును తీసుకున్నాడు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు కారును తిరిగి అప్పగించకపోగా, కారును అడిగితే ప్రతాప్‌రెడ్డి అనే మరో వ్యక్తితో కలిసి దుర్భాషలాడుతూ బెదిరిస్తున్నాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల: మండలంలోని ఐఎస్ రాఘవాపురం పంచాయతీ తూర్ల లక్ష్మీపురం గ్రామంలో కోడి పందేల స్థావరంపై ఆదివారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.1,450 నగదు, ఒక కోడి పుంజు, ఒక కోడి కత్తిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

సీసీ రహదారి పనులు ప్రారంభం



రేచర్ల గ్రామ పంచాయతీ రెండో మైలురాయి తండాలో చేపట్టిన సీసీ రహదారి పనులు

చింతలపూడి : చింతలపూడి మండలం, రేచర్ల గ్రామ పంచాయతీ రెండోమైలు రాయి తండాలో ఆదివారం సీసీ రహదారి పనులు ప్రారంభించారు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు సీసీ రహదారి నిర్మాణానికి రూ.5 లక్షల నిధులు మంజూరు చేయడంతో రహదారి నిర్మాణ పనులు చేపట్టినట్లు ఎంపీపీ డా బి.రాంబాబు నాయక్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.శివరామకృష్ణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వరద గ్రామాల్లో వైద్య శిబిరాలు



భూదేవిపేటలో పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న డీపీవో రాజాఉల్లా, ఎంపీడీఓ శ్రీహరి



టేకుపల్లిలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యశాఖ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ రాజీవ్

వేలేరుపాడు : గోదావరి వరద వల్ల బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయిన గ్రామాల్లో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ రాజీవ్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరాలు నిర్వహించారు. వేలేరుపాడు మండలంలో అత్యంత మారుమూల గ్రామాలైన టేకుపల్లి, కాకిసనూరు గ్రామాలకు గోదావరిలో బోట్‌పై వెళ్లి వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో మొత్తం 115 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యం అందించారు. కార్యక్రమంలో కొయిదా వైద్యాధికారి మాధురి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరద గ్రామాల్లో పారిశుధ్య పనులు

జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు గోదావరి వరద ప్రభావిత గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరం చేశారు. గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నారు. మండలంలోని ఎర్రబోరు, వేలేరుపాడు మెయిన్ సెంటర్, తాట్కూరుగొమ్ము, భూదేవిపేట, శివకాశీపురం గ్రామాల్లో ఆదివారం పారిశుధ్య పనులు నిర్వహించారు. డివిజనల్ పంచాయతీ అధికారి రాజాఉల్లా, ఎంపీడీఓ శ్రీహరి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

450 మంది రోగులకు వైద్యసేవలు



రాజవరంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : రాజవరం గ్రామంలో బెతెస్తా ప్రార్థన మందిర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మందిరం వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గుండె, కిడ్నీ, చెవి, ముక్కు, గొంతు, షుగర్, బీపీలకు సంబంధించిన వైద్య పరీక్షలతోపాటు గర్భిణులు, చిన్న పిల్లలకు సంబంధించిన సమస్యలపై ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జంగారెడ్డిగూడెం నిర్మల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ బిందు, డాక్టర్ గిరిజ, డాక్టర్ వంకదారి వెంకట సత్యసాగర్, డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ లక్ష్మి, వారి సిబ్బంది 450 మంది రోగులకు వైద్యసేవలందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య, తమిర్చి బ్రహ్మయ్య, శ్రీరంగ నిలయం కాశీ విశ్వనాథ్, ఉప సర్పంచ్ అనంతల సుబ్బారావు, మాజీ సర్పంచ్ పాముల నాగ మునిస్వామి, ట్రస్ట్ అధ్యక్షులు కె.జాకబ్, కె.విజయ్ దేవరాజు, పి.గిరిబాబు, వై.ఏసుబాబు, పి.యోహాన్, తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల వద్ద ఏర్పాట్ల పరిశీలన



దాచారం వరద పునరావాస కేంద్రం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఐటీడీఏ పీఓ సత్యనారాయణ

కుక్కునూరు : వరద బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల వద్ద బాధితులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ సిబ్బందిని కేఆర్ పురం ఐటీడీఏ పీఓ సత్యనారాయణ ఆదేశించారు. ఆదివారం ఆయన రావికుంట ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రంలో తాగునీటి ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెడికల్ క్యాంప్ వద్దకు వెళ్లి పాము కాటుకు, మలేరియా, టైఫాయిడ్‌కు సంబంధించి మందులు ఉన్నాయా లేవా అంటూ అడిగి తెలుసుకున్నారు. ఒక వేళ మందులు అందుబాటులో లేకుంటే వెంటనే తెప్పించుకోవాలని సూచించారు. శానిటేషన్ విషయంలో పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. బాధితులు ఎటువంటి ఇబ్బంది పడకుండా శానిటేషన్ పనులు నిర్వహించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం నుంచి బాధితులకు నిత్యావసర సరుకులు కూడా అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఇబ్రహీం, నరసింహారావు, పెంటారావు, గఫూర్ తదితరులు ఉన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ఏలూరు (టూటౌన్) : వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ ఎన్నికలముందు ఇచ్చిన వాగ్దానానికి అనుగుణంగా రెగ్యులర్ చేయాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి జఫరుల్లా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యూనియన్ జిల్లా సమావేశం టి.శ్రీలక్ష్మి అధ్యక్షతన స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయం వద్ద ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సయ్యద్ జఫరుల్లా మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు డీఎన్‌వీడీ ప్రసాద్, జిల్లా నాయకులు పాల్గొన్నారు. అనంతరం యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన డి.వేణుగోపాలచారిని అభినందించారు.

సీఎం జగన్‌కు కొప్పువెలమలు రుణపడి ఉంటారు



జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ దంపతులను సత్కరిస్తున్న కొప్పు వెలమ సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్) : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కొప్పువెలమలు ఎంతో రుణపడి ఉంటారని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. ఏలూరు నగరంలో కొప్పువెలమ సంఘం ఆధ్వర్యంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ దంపతులను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో కొప్పు వెలమలకు తగిన గుర్తింపు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా, మంత్రిగా పదవులను కట్టబెట్టిన సీఎం తాజాగా గోదావరి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ పదవిని తొలిసారిగా అవకాశం కల్పించారన్నారు. కొప్పు వెలమలు తమ పిల్లలను ఉన్నత విద్యావంతులను చేయడం ద్వారా అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు, మాజీ మంత్రి మరడాని రంగారావు, మూడెడ్ల రంగారావు, అల్లు ఉమామహేశ్వరరావు, ఆర్నేపల్లి మధు, బల్లా శివ, మరడాని అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ అల్లర్లకు కారణమైన దోషులను ఉరితీయాలి



జంగారెడ్డిగూడెంలో ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

జంగారెడ్డిగూడెం : మణిపూర్‌లో జరిగిన అల్లర్లపై నిరసన తెలుపుతూ స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు ఆదివారం ధర్నా నిర్వహించారు. పార్టీ మండల కమిటీ సభ్యులు జి.సూర్యకిరణ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లాడుతూ అల్లర్లకు కారణమైన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను, గూండాలను శిక్షించాలని, దోషులను ఉరితీయాలని, ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే రాష్ట్రపతి జోక్యం చేసుకొని మణిపూర్ మారణకాండను ఆపాలని కోరారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్‌రావు, జె.సూర్యచంద్రం, కె.సుబ్బారావు, ప్రజాసంఘాల నాయకులు కె.లెనిన్, ఎన్.రాజేష్, బి.నాని, టి.భద్రం తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలి

మణిపూర్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని న్యాయవాది యు.ఏసుబాబు డిమాండ్ చేశారు. మణిపూర్ ఆదివాసి ప్రజలపై యువతులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ జంగారెడ్డిగూడెం మార్కెట్ యార్డ్‌లో నిరసన సభ నిర్వహించారు. ఈ సభలో ఏసుబాబు మాట్లాడుతూ గత 80 రోజులుగా మణిపూర్‌లో ఇంటర్నెట్ బంద్ చేసి, అక్కడ ఆదివాసీల పైన, క్రిస్టియన్ చర్చల పైన దాడులు చేసి వందలాదిమంది ఆదివాసీలను చంపేశారని, వెంటనే ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలన్నారు. ఈ ఘటనకు ఏమీ స్పందించని కేంద్ర మహిళా కమిషన్ పైనా, చులకనగా మాట్లాడిన మంత్రులపై సుప్రీంకోర్టు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షులు కేవీ రమణ, తమ్మ సోమలింగ మల్లికార్జునరావు, గంపల వెంకటేశు, పాడిదోలు దుర్గారావు, ముప్పిడి గంగారామ్, దొండపాటి వెంకటేశ్వరరావు, పీఓడబ్ల్యూ నాయకురాలు కె.రామ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమావేశం విజయవంతంపై హర్షం

దెందులూరు: జాతీయస్థాయి రేషన్ డీలర్ల మహాసదస్సు విజయవాడలో విజయవంతం కావడంపై రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, ఏలూరు జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం పోతునూరులో మండల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్ల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. డీలర్ల సంక్షేమం, అభివృద్ధి, భద్రత, భవిష్యత్తు దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. డీలర్ల మహాసభలో రాష్ట్ర మంత్రి కారుమూరి డీలర్లపై వరాలు జల్లు కురిపించడం సంతోషంగా ఉందన్నారు. కమిషన్ పెంచడం, చనిపోయిన రేషన్ డీలర్లకు మట్టి ఖర్చు ఇస్తామని, మృతి చెందిన డీలర్ల కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని, సరుకుల్లో తరుగులు రాకుండా చర్యలు తీసుకుంటామని, ఎంఎల్ఎస్ పాయింట్ల వద్దే రేషన్ తీసుకునేలా పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని, రేషన్ డీలర్లందరికీ ఎటువంటి సమస్యలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, మంత్రి కారుమూరి హామీ ఇవ్వడం రేషన్ డీలర్లందరికీ సంతోషంగా ఉందని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రేషన్ డీలర్ల రాష్ట్ర కమిటీ, ఏలూరు జిల్లా కమిటీ తరఫున జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం సీజ్

పెదపాడు: అక్రమంగా కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని పెదపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం పెదపాడు గ్రామం వైపునకు కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పెదపాడు ఎస్సై తన సిబ్బందితో కలిసి అడ్డుకుని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కృష్ణ చల్లా తెలిపారు.

విద్యార్థులను తల్లిదండ్రుల్లా ఆదరించాలి



సమీకృత బాలికల వసతి గృహంలో భోజనాన్ని రుచిచూస్తున్న జేడీ జయప్రకాష్

చింతలపూడి : చింతలపూడి సమీకృత బాలికల వసతి గృహాన్ని, అంబేద్కర్ గురుకుల పాఠశాలలను సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ వి.జయప్రకాష్ ఆదివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పెడుతున్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. పిల్లలకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వసతి గృహ సిబ్బందిని, కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. నాణ్యమైన భోజనం పెడుతున్నారా, నాణ్యమైన విద్యను బోధిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థినీ, విద్యార్థులపై సత్ప్రవర్తన కలిగి ఉండాలని, పిల్లలను తల్లిదండ్రుల్లా ఆదరించాలని సూచించారు. ఎలాంటి ఆరోపణలు రాకుండా జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. ఆయన వెంట సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ఉన్నారు.